# నులిపురుగుల నియంత్రణతో సంపూర్ణ ఆరోగ్యం

- జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అల్బెంజోల్ మాత్రలు పంపిణీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చేవెళ్ల రూరల్, జూన్ 20 : విద్యార్థులు శుభ్రత పాటించి రోగాలు దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధి ఊరెళ్ల గ్రామ రెవెన్యూలోని సాగర్ ఇంజినీరింగ్ కళాశాలలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల, కళాశాల(బురాన్‌పూర్)లో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశంలో ఆరోగ్య సంస్కరణలతో చిన్న పిల్లల మరణాలు తగ్గాయని, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో భారతదేశం అభివృద్ధిలో రెండో స్థానంలో ఉన్నదని, రానున్న 10 సంవత్సరాల్లో నం.1గా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పరిసరాలు.. వ్యక్తిగత శుభ్రత అవసరం**

పరిసరాల పరిశుభ్రతతోపాటు విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల డివిజన్‌లో 95,246 మంది 12 నెలల నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యార్థుల్లో బుద్ధి మాంద్యం, అరుగుదల లేకపోవడం తదితర సమస్యలను నివారించడానికి ఈ మాత్రలు ఉపయోగపడుతాయని తెలిపారు.


చేవెళ్లరూరల్ : విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఎంపీపీ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో దామోదర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, వైస్ ఎంపీపీ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, దేవునిఎర్రవల్లి మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, నాయకులు శర్వలింగం, శ్రీనివాస్, కృష్ణ, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శ్రీశైలం, నాగరాజు, కరుణాకర్, శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ రఘుబాబు, ఆర్‌బీఎస్‌కే అధికారి డా.నెక్టార్, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష, వైస్ ప్రిన్సిపాల్ రాజసులోచన, డిప్యూటీ వార్డెన్ సల్మా, హెల్త్ సూపర్‌వైజర్ సిరి తదితరులున్నారు.

### నులిపురుగులను నివారించాలి

**తుర్కయాంజాల్ :** నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో వినోద్, తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం కార్యక్రమంలో భాగంగా గురువారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూరులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందును అందజేశారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే నులి పురుగులను నియంత్రించాలని వినోద్ సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివలింగంగౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, హెచ్‌వో లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింహ, ఏఎన్‌ఎం పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


తుర్కయాంజాల్ : విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

### కొత్తూరు మున్సిపాలిటీలో..

**కొత్తూరు :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మండల వైద్యాధికారి డా.హరికిషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తన మొదటి అధికారిక కార్యక్రమం కొత్తూరులో జరగడం ఆనందంగా ఉందన్నారు. అది కూడా విద్యార్థులకు ఆరోగ్యానికి సంబంధించి కావడం గర్వకారణంగా ఉందన్నారు.

జడ్పీటీసీ శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యంపట్ల వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడాది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రను సగం.. రెండేండ్ల నుంచి 19 ఏండ్ల విద్యార్థులకు ఒక మాత్ర వేయాలన్నారు. శుక్రవారం యోగా దినోత్సవం ఉందని.. ఆ కార్యక్రమంలో కూడా విద్యార్థులు పాల్గొనాలన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీనివల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

**పెంజర్లలో..**

కొత్తూరు మండలంలోని పెంజర్లలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీలత పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేయించాలన్నారు. ఎస్‌బీపల్లిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీలత పాల్గొన్నారు. కొడిచెర్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, హెచ్‌ఎం అంగూర్‌నాయక్, కౌన్సిలర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్‌యాదవ్, యాదయ్య ఉన్నారు.


కొత్తూరులో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



## తప్పులుంటే సరిచేసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

వికారాబాద్, జూన్ 20 : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారు ఏవైనా తప్పులు దొర్లితే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరిచేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజాపాలనలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారన్నారు. కొందరు అర్జీదారులు దరఖాస్తుల్లో తప్పులు పూరించగా లబ్ధి పొందకుండా ఉన్నారన్నారు. అర్హులైనవారు లబ్ధి పొందేందుకు వీలుగా తప్పులను సరిచేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గృహజ్యోతి కింద విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అందనట్లయితే రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదుతో పాటు ప్రజాపాల సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులో ఉన్న తప్పులను సరిచేసుకొని అర్హులైన అర్జీదారులు ప్రజాపాలన పథకాల ఫలితాలను పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు.

## బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**


జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఆషాఢ మాసంలో నెల రోజుల పాటు జరుపుకొనే బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం బోనాల ఉత్సవాలు-2024పై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో 2400 ఆలయాలున్నాయని చెప్పారు. ఆలయాలకందించే డబ్బులను పెంచడంపై దృష్టి సారించామని చెప్పారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 20: ఆర్థిక, సామాజిక రంగాలలో మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, రాష్ట్ర పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ టీజీ ఐఆర్‌డీ సమావేశం మందిరంలో గురువారం జరిగిన డీఆర్‌డీఓల రాష్ట్ర స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామీణ మహిళలు సైతం ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానికంగా ఉండే ముడి సరుకులకు నాణ్యత లోపించకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దే విధంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆహార పదార్థాలను తయారుచేసే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్‌ల చేతుల్లో సామాన్యులు బందీలుగా మారి, అనేక వేధింపులకు గురయ్యారని గుర్తు చేశారు. మహిళలను లక్షాధికారులుగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి సూచించారు. నాటి నుంచే మహిళా ఓరియంటెడ్, సెర్ప్ సంస్థలను ప్రోత్సహించి మహిళలను చైతన్యం చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరి సుల్తానియా, టీజీఐఆర్‌డీ డైరెక్టర్ కాత్యాయినీ వైది పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

## గిరిజనుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్**

కడ్తాల్, జూన్ 20 : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. గిరిజనుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సేవాలాల్ సేన రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా సేవాలాల్ సేన ఆధ్యర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నం.3కు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, నూతన గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గిరిజనులకు మంత్రి పదవి కేటాయించాలన్నారు. అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని.. ఆయా విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్ భీమ్‌లాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్‌నాయక్, కందుకూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవి నాయక్, సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు బలరాంనాయక్, నాయకులు లక్ష్మణ్‌పవార్, రాజేందర్ పాల్గొన్నారు.

# ఎస్పీ కోటిరెడ్డికి ఘన వీడ్కోలు

వికారాబాద్, జూన్ 20 : వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి 26/12/2021 నుంచి విధులు నిర్వహించి, మేడ్చల్ డీసీపీగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎస్పీకి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది గురువారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీసు కవాతు నిర్వహించగా.. గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసినట్లు చెప్పారు. హోం గార్డు నుంచి పైస్థాయి అధికారి వరకు సమయస్ఫూర్తితో పని చేయడంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదన్నారు. ఇకముందు కూడా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సహకరించిన జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జిల్లా వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీకి వీడ్కోలు పలుకుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

# అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

**జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ చంద్రశేఖర్, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి**


షాబాద్‌లో ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

షాబాద్, జూన్ 20 : అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ చంద్రశేఖర్, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ శివకుమార్ అన్నారు. గురువారం షాబాద్ మండలంలోని నాగరగూడ, షాబాద్ గ్రామాల్లో ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏవో వెంకటేశం, స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి

**చేవెళ్లటౌన్ :** విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ చంద్రశేఖర్, ఏడీఏ సీడ్ సర్టిఫికేషన్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం చేవెళ్లలోని తిరుమల సీడ్స్, సాయినాథ్ సీడ్స్, మన గ్రోమోర్ సెంటర్‌లో విత్తనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టాక్ రిజిస్టర్, వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, మండల ఏవో తులసి ఉన్నారు.


చేవెళ్లటౌన్ : ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం


చేవెళ్లరూరల్ : మొయినాబాద్‌లోని ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

### ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ

**చేవెళ్ల రూరల్ :** అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అన్నారు. గురువారం మొయినాబాద్‌లోని శ్రీబాలాజీ, శ్రీసద్గురుసాయి, కిసాన్ ఫెర్టిలైజర్ సెంటర్లను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు విత్తనాల విక్రయం తరువాత తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ఉన్నారు.


కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌ను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

## కోట్‌పల్లి ప్రాజెక్టు పరిశీలన

ధారూరు, జూన్ 20 : స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులోని రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లను నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీకాంత్, అనిల్‌కుమార్, ఎస్‌ఈ రంగారెడ్డి పరిశీలించారు. గతంలో కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.110 కోట్ల ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే.. ఈ విషయమై అధికారులు ప్రాజెక్టును పరిశీలించారు. వీరి వెంట నీటిపారుదల శాఖ ఈఈలు భాస్కర్‌గౌడ్, మాధవీలత ఉన్నారు.

## బదిలీలు, ప్రమోషన్లు కొనసాగేలా చూడాలి

**ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుల వినతిపత్రం**

కొత్తూరు, జూన్ 20 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల లాగానే రంగారెడ్డి జిల్లాలో కూడా ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కొనసాగేలా చూడాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు గురువారం వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి షాద్‌నగర్, కల్వకుర్తి డివిజన్లలోని 10 మండలాలు రంగారెడ్డి జిల్లాలో కలిపారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో ఈ 10 మండలాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు రానీయకుండా ఆపారని ఎమ్మెల్సీకి వివరించారు. అన్ని జిల్లాలతోపాటే ఈ 10 మండలాల ఉపాధ్యాయులకు కూడా బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వివరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కొత్తూరు పీఆర్టీయూ ప్రెసిడెంట్ విజయ్‌సాగర్, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, రమాదేవి, ఉమ, సుజాత, పద్మజ, శైలజాభాను ఉన్నారు.

## టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి



రంగారెడ్డి, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీకాంత్‌రెడ్డికి రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవి లభించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ వారి గొంతుకగా ఉంటానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఐఐటీ మొదటి విడత కౌన్సెలింగ్‌లో చిలుకూరు గురుకుల విద్యార్థుల హవా

చేవెళ్ల రూరల్, జూన్ 20 : గురువారం విడుదలైన ఐఐటీ మొదటి విడత కౌన్సెలింగ్‌లో చిలుకూరు గురుకుల విద్యార్థులు సంచలనం సృష్టించారు. మొదటి విడతలో ఐఐటీలో సీట్లు సాధించి కీర్తి ప్రతిష్టలు చాటారు. వి.సంపత్ కుమార్, ఐఐటీ రూర్కీ (ఎలక్ట్రికల్), ఎస్.రాహుల్, ఐఐటీ బాంబే (ఎయిరోస్పేస్), వి.రుషి, జార్ఖండ్ (సివిల్), డి.సంతోష్ కుమార్, బిలాయ్ (మెటీరియల్ సైన్స్), అభిలాష్, దుర్గాపూర్ (మెటలర్జీ), టి.తరుణ్, పాట్నా (మెటీరియల్ సైన్స్)లలో సీట్లు సాధించారు. దీంతో వీరిని ప్రధానాచార్యులు వై.సత్యనారాయణ, తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందించారు.

## నేడు నలుపు దుస్తులతో విధుల్లోకి జూడాలు

- జూనియర్ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి
- సమ్మె నోటీసిచ్చి మూడు రోజులు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు : టీ జూడా

సుల్తాన్ బజార్, జూన్ 20: జూనియర్ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో టీ జూడాలు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె నోటీస్ ఇచ్చి మూడు రోజులవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం నల్ల దుస్తులు ధరించి విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. తమ సమస్యలతో పాటు తాము పడుతున్న బాధలను, జూడాల ఐక్యతను చాటేందుకు నల్ల దుస్తులు ధరించి విధులను నిర్వహిస్తున్నట్లు జూడాలు వివరించారు. ఈ నెల 24 నుంచి టీ జూడా సమ్మెను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.